క్లుప్తంగా

సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించిన ఇళ్లకు నోటీసు



ఇంటి వద్ద కొలుస్తున్న కమిషనర్, సిబ్బంది

రాయికల్: మున్సిపల్‌లో సెట్‌బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న ఇళ్లకు నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగుల సంతోష్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్ బీపాస్ ద్వారా ఇంటి నిర్మాణ అనుమతి పొంది సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట టీపీఎస్ రమ్య, జూనియర్ అసిస్టెంట్ హరీశ్, వినయ్ ఉన్నారు.

ఏబీసీడీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

కోరుట్లటౌన్: మాదిగ రిజర్వేషన్ ఏబీసీడీ వర్గీకరణ బిల్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని బీజేపీ కోరుట్ల సెగ్మెంట్ నాయకులు సురభి నవీన్‌కుమార్‌కు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు శనివారం వినతిపత్రం సమర్పించారు. నాయకులు బలవంతుల సురేశ్, శనిగరపు వినోద్, బొల్లె మణిదీప్, చిట్యాల నితిన్, రమణ, కిషోర్, శివ, రమేశ్, రాజేశ్, రవి, గణేశ్, విక్రమ్, సంజీవ్, సుమన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆలయ భూమిని రక్షించాలి



ముగ్గును తొలగిస్తున్న ఆలయ అధికారులు

కోరుట్ల: పట్టణ శివారులోని ఆదర్శనగర్‌లో సర్వే నెంబర్ 1492లో గల వేంకటేశ్వర ఆలయ భూమిని పరిరక్షించాలని ఆలయ అధికారులు కోరారు. 1492 సర్వేనెంబర్ గల ఆలయ భూమి నుంచి కొందరు శుక్రవారం ముగ్గు పోసి దారి ఏర్పాటు చేశారు. కాగా విషయం తెలుసుకున్న స్థానిక ఆలయ అధికారులు దేవాదాయశాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఆదేశాలతో స్థానిక ఆలయ అధికారులు శనివారం దారికోసం వేసిన ముగ్గును తొలగించారు. ఆలయ భూమి నుంచి దారిలేదని, గతంలోనే ట్రెంచ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య వీడ్కోలు వేడుక



నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కోరుట్లటౌన్: పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుక జీఎస్ గార్డెన్‌లో శనివారం జరిగింది. విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. శ్రీచైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యం నలువాల శేఖర్‌రెడ్డి, ముసిపట్ల రాజేందర్, ప్రిన్సిపాల్ శ్వేత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రం తిరస్కరించారని నిరసన



నిరసన తెలుపుతున్న బాధితుడు

సారంగాపూర్: తన కుమారుడికి కుల ధ్రువీకరణ పత్రాన్ని తిరస్కరించారని శనివారం బాధితుడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెంబట్లకు చెందిన కాముని గంగాధర్ కుమారుడు శరణ్‌రాజ్ ఈ నెల 13న కుల ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఇప్పటి వరకు ధ్రువీకరణ పత్రం ఇవ్వకపోగా, జారీ చేయకుండా తిరస్కరించారని శరణ్‌రాజ్ తండ్రి గంగాధర్ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దీనిపై తహసీల్దార్ రవీందర్‌రావును వివరణ కోరగా కొన్ని సాంకేతిక కారణాల వల్ల ధ్రువీకరణ పత్రాన్ని తిరస్కరించినట్లు రెవెన్యూ సిబ్బంది చెప్తున్నారని పేర్కొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో లెనిన్ వర్ధంతి

జగిత్యాలరూరల్: పట్టణంలోని కొక్కుల బుచ్చమ్మ భవన్‌లో సీపీఐ పట్టణ కన్వీనర్ కోరుకంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమ్యూనిస్ట్ యోధుడు లెనిన్ వర్ధంతి నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్, దేవదాసు, కిరణ్, సత్తవ్వ, లెనిన్ బుద్ధ, భీమన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

అన్నార్థులకు అండగా.. 'బాలాంబిక'

సండే స్పెషల్

- వివేకానందుడి సంకల్పం.. ఆ యువతకు ఆదర్శం
- పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా సేవలు
- ఫంక్షన్లలో మిగిలిన ఆహారం పేదలకు పంపిణీ
- రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు
- సమాజ సేవకు కేరాఫ్‌గా నిలుస్తున్న బాలాంబిక ఫౌండేషన్

జగిత్యాలటౌన్: వివేకానందుడి బోధనల స్ఫూర్తితో ఎదుటి వారి ఆకలి తీర్చడమే తమ జీవితలక్ష్యంగా పెట్టుకున్న 10మంది యువకులు మరికొంత మంది సహకారంతో అనాథ, పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా నిలుస్తున్నారు. వారంతా 30ఏళ్ల లోపు యువకులే. తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా అన్నార్థుల ఆకలి తీర్చేందుకు కేటాయిస్తున్నారు. వీధులు, బస్టాండ్లలో దొక్కలు లోపలికి పోయి విలపిస్తున్న వారికి ఆహారం చేరవేస్తున్నారు జగిత్యాలకు చెందిన యువకులు. వరుణ్‌సాయి, గంగిపెల్లి రత్నాకర్ నేతృత్వంలో బాలాంబిక ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. పేదవారి ఆకలి తీర్చడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.



అన్నదానం చేస్తున్న బాలాంబిక ఫౌండేషన్ ప్రతినిధులు

సేవకు కేరాఫ్‌గా ఫౌండేషన్



రక్తదాతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే ఉద్దేశంతో బాలాంబిక ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన యువకులు అనేక సేవా కార్యక్రమాలతో పేద వారికి తామున్నామన్నా భరోసా కల్పిస్తున్నారు. పట్టణంతో పాటు సమీప గ్రామాల్లో పెళ్లిళ్లు, పేరంటాలు, శుభకార్యాలలో మిగిలిన ఆహారాన్ని సేకరించి రోడ్ల వెంట, బస్టాండుల్లో తలదాచుకునే అన్నార్థుల ఆకలి తీరుస్తున్నారు.

కరోనా కష్టకాలంలో..



బాలాంబిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు

కరోనా కష్టకాలంలో పలువురు పేదలు పని లేక ఆకలితో అలమటిస్తున్న నిరుపేద కుటుంబాలు, ఒంటరి మహిళలకు నిత్యావసర సరుకులు అందించి అండగా నిలిచారు.

చలివేంద్రాల ఏర్పాటు..

ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా బస్టాండ్లు ప్రధాన కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాలు, మందుల పంపిణీ

వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆరోగ్య పరీక్షలు చేయించుకునే స్తోమత లేని వారిని గుర్తించి వారికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు.

రక్తదాన శిబిరాలు..

ప్రమాదాల బారిన పడటంతో పాటు ఆరోగ్య సమస్యలతో అత్యవసరంగా రక్తం అవసరమైన వారికి ఆపద సమయంలో ఆదుకునేలా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ బ్లడ్ బ్యాంకుల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

మిత్రుల సహకారంతో..



స్వామి వివేకానంద స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మిత్రుల సహకారంతో బాలాంబిక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– మ్యాన సాయివరుణ్, బాలాంబిక ఫౌండర్

సేవతోనే సంతృప్తి



నా లక్ష్య సాధనకు సమయాన్ని కేటాయిస్తూనే మిగిలిన సమయాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నాను. సేవతో ఎంతో సంతృప్తి కలుగుతుంది. యువత తమ విలువైన సమయాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించాలి.

– గంగిపెల్లి రత్నాకర్, ఫౌండేషన్ సభ్యుడు

అటెన్షన్ ప్లీజ్



నిరుపయోగంగా అంగన్‌వాడీ కేంద్రం

పెగడపల్లి: మండలంలోని బతికపల్లి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. పదేళ్ల క్రితం నిర్మించిన ఈ భవనంలో కొన్నాళ్లు కేంద్రం నిర్వహించి రహదారి సక్రమంగా లేదన్న కారణంగా మూసివేసి అద్దె ఇంట్లోకి మార్చారు. అప్పటి నుంచి ఈ కేంద్రం నిరుపయోగంగా ఉంటోంది. భవనాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారిపేరు : నర్సింగరాణి, సీడీపీవో
ఫోన్ నంబర్ 96188 38437

'నీళ్లిస్తామని హామీ ఇచ్చి.. మాట తప్పారు'



రాస్తారోకో నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

సారంగాపూర్: రోల్లవాగు ప్రాజెక్టు కింద రైతులకు జనవరి 15 నుంచి నీరు విడుదల చేస్తామని అధికారులు హామీ ఇచ్చి మాట తప్పారని బీజేపీ శ్రేణులు శనివారం బీర్‌పూర్ మండలం తుంగూర్ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించాయి. బీర్‌పూర్ శివారుల్లోని రోల్లవాగు ప్రాజెక్టు తెగిపోయిన కట్ట పనులను జనవరి రెండో వారం లోపు పూర్తి చేసి, యాసంగికి సాగునీరు అందిస్తామని అధికారులు చెప్పారని గుర్తు చేశారు. దీంతో రైతులు వందలాది ఎకరాల్లో వరిపంట సాగుచేయడానికి వరినార్లు పోశారని, ప్రస్తుతం వరినార్లు ముదురుతున్నా ఇప్పటికీ నీటిని విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోల్లవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో అరగుండాల ప్రాజెక్టు, గోదావరి వెంట ఉన్న లిఫ్టులు అన్నింటికీ నష్టం జరిగిందని ఈ కారణంగా బీర్‌పూర్ మండలం ఎడారిగా మారిందన్నారు. విషయం తెలుసుకున్న బీర్‌పూర్, సారంగాపూర్ ఎస్సైలు అజయ్, మనోహర్‌రావు, డిప్యూటి తహసీల్దార్ విష్ణు ధర్నా చేస్తున్న నాయకులను విరమించాలని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. బీజేపీ నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, మ్యాడ జనార్దన్, ఆడెపు తిరుపతి, అప్పాల జలేందర్, పడాల తిరుపతి, బుట్ల మార్కండేయ, రఘువీరారెడ్డి, ఆడెపు సత్యం, జున్ను సంతోష్, వేముల కరుణాకర్‌రెడ్డి, నారపాక ప్రభాకర్, మాడిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలను వెంటనే తగ్గించాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మల్యాల: విద్యుత్ ఏసీడీ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం మల్యాల అడ్డ రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏఈ కొమ్ము కమలేశ్వర్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాచర్ల రమేశ్, సంగని రవి, మల్లేశం, కిషన్, రాములు, రాజశేఖర్, చక్రంగౌడ్, మానిక్ పాల్గొన్నారు.

వెంటనే రద్దు చేయాలి

కొడిమ్యాల: పెంచిన ఏసీడీ విద్యుత్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని పూడూర్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం సమర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ వెంటనే ఏసీడీ చార్జీలు రద్దుచేసి నిరంతర 24 గంటల విద్యుత్ ఇవ్వాలని కోరారు. కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి వడ్లకొండ బుచ్చిరాములు, కిసాన్‌మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు బొనగాని మల్లేశం, పార్టీ మండల ఉపాధ్యక్షులు చల్లా శ్రీనివాసరెడ్డి, ఆకునూరు తిరుపతి, నాయకులు బండ నరసింహారెడ్డి, పీసరి నాగరాజు, బొక్కెన అరుణ్‌కుమార్, మానుపాటి శేఖర్, గోనెపెల్లి ప్రశాంత్‌గౌడ్, కొత్తూరి అంజి, కొత్తూరి ప్రేమ్‌కుమార్, ఏదూరి అనిల్, లక్ష్మణచారి, కాముని మున్నా, సదానందం పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి: విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న ఏసీడీ చార్జీలను రద్దు చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. నష్టాలను అధిగమించడానికి విద్యుత్ సంస్థలు వినియోగదారుల నుంచి అధిక చార్జీలను వసూలు చేయడం సరికాదన్నారు.

లక్ష్యం కోసం ముందుకు సాగాలి



మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్‌కుమార్

మల్లాపూర్: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఒక సమున్నత లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగితే విజయం తమ సొంతమవుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని చిట్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకుని లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. సర్పంచ్‌లు జోగుల మమత, బిట్ల సరోజన, ఎంపీటీసీలు తోట సుజాత, గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్‌లు కొడిమ్యాల రవి, వెల్మల రాజనర్సయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ తోట మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

రాళ్లవాగు ప్రాజెక్టు కాలువలో పిచ్చిమొక్కలు తొలగింపు



కాలువలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న రైతులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారులో రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను శనివారం రైతులు తొలగించారు. కాలువలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో ప్రాజెక్టు నుంచి నీళ్లు సరిగా రావడంలేదని భావించి వాటిని తొలగించినట్లు రైతులు పేర్కొన్నారు. అధికారులు చొరవ చూపి ప్రాజెక్టు నుంచి కుడికాలువకు నీళ్లు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

రైతుల పక్షపాత ప్రభుత్వం బీఆర్‌ఎస్



ఎమ్మెల్యేను కలిసిన నర్సింగాపూర్ నాయకులు

జగిత్యాలరూరల్: రైతు పక్షపాత ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జగిత్యాల మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌లో గ్రామాలను అనుసంధానం చేయకుండా రైతుల అభ్యర్థన మేరకు మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని కౌన్సిల్ తీర్మానం చేయడంపై జగిత్యాలరూరల్ మండలం నర్సింగాపూర్ రైతులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ మహేశ్, నాయకులు మల్లారెడ్డి, నరేశ్, మల్లారెడ్డి, మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

కొడుకు పోషించడం లేదని ఆర్డీవోకు తల్లి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న వృద్ధురాలు

జగిత్యాలరూరల్: చిన్నకొడుకు ఆస్తిపాస్తులు తీసుకుని తనను పోషించడం లేదని 98 ఏళ్ల వయస్సు గల వృద్ధురాలు కూతుళ్ల సాయంతో శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ధర్మపురి మండలం జైనా గ్రామానికి చెందిన టేకుమల్ల లస్మవ్వకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. అందరికీ వివాహాలయ్యాయి. 2012లో భర్త టేకుమల్ల బాలయ్య మృతిచెందడంతో లస్మవ్వ పెద్ద కుమారుడు రాజన్న వద్ద ఉంటోంది. చిన్న కుమారుడు ప్రభాకర్ ఇప్పటి వరకు తనను పట్టించుకోవడం లేదని, పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టినా.. పోషించడంలేదు. అతడిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కార్యాలయంలో ఏవో రాజమనోహర్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది.

రైతులు పంటసాగులో మెలకువలు పాటించాలి

మల్లాపూర్: రబీలో పంట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ విస్తరణ అధికారి సంధ్య సూచించారు. ఈ మేరకు శనివారం మండలంలోని రాఘవపేట, సిరిపూర్ రైతులతో కలిసి వరిపంట పొలాలను ఆమె పరిశీలించారు. సర్పంచ్‌లు భూక్య గోవింద్‌నాయక్, నత్తి లావణ్య, ఎంపీటీసీలు ఏనుగు రాంరెడ్డి, ఆరె రాజేందర్, ఉపసర్పంచ్ అమీన్ పాల్గొన్నారు.

మేడిపెల్లి: మండల కేంద్రంలోని రైతులకు చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అధికారులు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారి వంశీ పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురిలోని రైతువేదికలో జైనాకు చెందిన రైతులకు, మండలంలోని దమ్మన్నపేట గ్రామ పంచాయతీలో అగ్రికల్చర్ ఏఈవో ధరణి, మౌనిక ఆధ్వర్యంలో రైతులకు అవగాహన నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

✦నిత్యావసర సరుకులు పంపిణీ

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన మంద లావణ్య అనే నిరుపేద కుటుంబానికి అదే గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు బొమ్మకంటి అనిల్ శనివారం నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సామాజిక కార్యకర్తలు కడకుంట్ల జగదీశ్వర్, బొమ్మకంటి నాగరాజు, చింతకుంట సాయికుమార్, షాకీర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

✦23న జరిగే రైతు ధర్నాకు తరలిరావాలి

సారంగాపూర్: ఈ నెల 23న బీర్‌పూర్ మండల కేంద్రంలో రోల్లవాగు ప్రాజెక్టు నీటి విడుదలపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతుల ధర్నా, నిరసన కార్యక్రమానికి మండల రైతులు భారీగా తరలిరావాలని పార్టీ బీర్‌పూర్ మండల అధ్యక్షుడు చెర్పూరి సుభాష్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిసె జితేందర్, ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ కోరారు. ఈ మేరకు శనివారం బీర్‌పూర్ మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. రోల్లవాగు ప్రాజెక్టు పనుల్లో జాప్యంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, నీటి విడుదల లేక వరినార్లు ఎండిపోతున్నాయన్నారు. దీనిని నిరసిస్తూ చేపట్టే ధర్నాకు రైతులు, మత్స్యకారులు, పార్టీ కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీలు రంగు లక్ష్మణ్, ఆడెపు మల్లీశ్వరి, కోఆప్షన్ సభ్యురాలు ఎండీ.బీబా తదితరులు పాల్గొన్నారు.

✦నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బుగ్గారం: సిరికొండ ఫీడర్ షిఫ్టింగ్ మరమ్మతు నేపథ్యంలో బుగ్గారం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు నేరెళ్ల సెక్షన్ ఏఈ బండారి అశోక్ తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలైన సిరికొండ, బీర్సాని, మద్దునూర్, గోపులాపూర్, వెనుగుమట్ల, లొత్తునూర్, బొంకూర్ గ్రామాల పరిధిలో ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

✦క్షీరాభిషేకం

జగిత్యాలరూరల్: మున్సిపల్ మాస్టర్ ప్లాన్ నుంచి రైతుల అభ్యంతరాల మేరకు మున్సిపల్‌లో ఏకగ్రీవ తీర్మానం చేయించి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ రద్దు చేయడంపై మోతె గ్రామంలో సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

నిధుల కోసం మంత్రికి వినతి



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని పోసానిపేటలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి శనివారం ప్రజాప్రతినిధులు, సంఘం సభ్యులు వినతిపత్రం ఇచ్చారు. హైదరాబాద్‌లో మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం ఇచ్చారు. అనంతరం వినతిపత్రం ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, సర్పంచ్ మిట్టపెల్లి గంగారెడ్డి, సంఘం ప్రతినిధులు గాంధారి శ్రీనివాస్, నాగేందర్, ఆంజనేయులు, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బీమా కలిగి ఉండాలి

కొడిమ్యాల: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా, బీమా కలిగి ఉండాలని లీడ్ బ్యాంక్ జిల్లా ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ కోట మధుసూదన్ సూచించారు. ఈ మేరకు శనివారం మండలంలోని పూడూర్‌లో భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం బీమా ఆవశ్యకతపై వివరించారు. ఇండియన్ బ్యాంక్ పూడూర్‌శాఖ మేనేజర్ మోతీలాల్, ఆదర్శ తాపీ మేస్త్రీ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గంగయ్య, తిరుపతి, బిజినెస్ కరస్పాండెంట్లు దేవయ్య, సాగర్, కిషోర్ పాల్గొన్నారు.

గౌడసంఘం భవన నిర్మాణ పనులు పరిశీలన

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న గీత పారిశ్రామిక సంఘం భవన నిర్మాణ పనులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ శనివారం పరిశీలించారు. రూ.25లక్షలతో నిర్మిస్తున్న గౌడ సంఘం భవన నిర్మాణం పూర్తిచేయడానికి మరో రూ.10లక్షల నిధుల మంజూరుకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు విన్నవించినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ రామ్మూర్తి ఉన్నారు.

ఖిలా మైదానాన్ని సిద్ధం చేయాలి



ఖిలాను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

జగిత్యాలరూరల్: భారత గణతంత్ర దినోత్సవాలకు ఖిలాను సిద్ధం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక ఖిలా మైదానంలో జరగనున్న గణతంత్ర వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ శాఖలు తమ శాఖల ప్రగతిని తెలియజేసే ప్రదర్శనలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అల్లె గంగసాగర్, నాయకులు హైమద్, సిరికొండ సింగరావు, రాంమోహన్, రాజు కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎల్లం పాల్గొన్నారు.